క్లుప్తంగా

ఎంఎల్‌హెచ్‌పీకి సన్మానం



పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా సేవలందించి గ్రామస్తుల అభిమానం చొరగొన్న కృష్ణవేణిని సోమవారం వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసి మరోదానికి వెళ్తున్నట్లు తెలిపారు. కృష్ణవేణి బాధ్యతలను ఏఎన్‌ఎం రాధికకు అప్పగించారు.

ఐఓటీపై వర్క్‌షాప్



కోవూరు: గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఐఓటీ' అనే అంశంపై వారం రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ ఈసీఈ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుమల యాత్ర ప్రారంభం



నెల్లూరు(బృందావనం): సత్యమార్గ్ ఫౌండేషన్ (ఎస్ఎంఎఫ్) కన్వీనర్ పూడి రవిస్వామి ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి 28వ ఉచిత దీవెన యాత్రను సోమవారం పురమందిరం ప్రాంగణంలో ఘనంగా చేపట్టారు. గీతావైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్‌బాషా గురూజీ ఈ యాత్రను ప్రారంభించారు. నిర్వాహకుడు రవిస్వామి మాట్లాడుతూ జిల్లాలోని గుండ్లపాళెం, నిడుముసలి, ఇందుకూరుపేట, పోతురాజుదిబ్బ, జంగందొరువు, గమళ్లపాళెం, తోటపల్లిగూడూరు, వరిగొండ తదితర ప్రాంతాల నుంచి 360 మంది భక్తులతో యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. నిర్వాహకులు పూడి మస్తానమ్మ, మల్లికార్జున, సురేష్, కోవూరు సత్యమ్మ పాల్గొన్నారు.

రాపూరు డిపోకు రెండు కొత్త సర్వీసులు



మొక్క నాటుతున్న ఆర్టీసీ అధికారులు

రాపూరు: స్థానిక ఆర్టీసీ డిపోకు రెండు కొత్త సర్వీసులను మంజూరు చేసినట్లు ఆర్టీసీ ఈడీఓ అప్పలరాజు, జోనల్ ఈడీ నాగేంద్రప్రసాద్ వెల్లడించారు. రాపూరు ఆర్టీసీ డిపోను సోమవారం సందర్శించి ఇక్కడ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రాజంపేట – నెల్లూరు మధ్య రెండు కొత్త సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మరో రెండు హైర్ బస్సులు కూడా రానున్నట్లు చెప్పారు. రాపూరు ఆర్టీసీ గ్యారేజ్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన పార్కులో వారిద్దరూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీటీఎంలు శ్రీనాథ్, రమేష్, డిపో మేనేజర్ అనిల్‌కుమార్, ఆర్టీసీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రజల సహకారం అవసరం

నెల్లూరు(బారకాసు): నగర ప్రజలు వ్యర్థాలను నిర్దేశించిన డస్ట్ బిన్లలో మాత్రమే వేసి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి సహకరించాలని కమిషనర్ నందన్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలందరూ గృహ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, వీధుల్లో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలని సూచించారు. టిడ్కో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నామని తెలిపారు. స్థానిక సమస్యలను 94940 18118 నంబర్‌కు వాట్సాప్ ద్వారా లేదా 1800 425 1113 టోల్ ఫ్రీ నంబర్‌కు ఉదయం 6 నుంచి సాయంత్రం 6లోపు తెలియజేయాలని కోరారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 2, అప్కాస్ 2, ఇంజినీరింగ్ 9, టిడ్కో హౌసింగ్ 15, రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 5, పబ్లిక్ హెల్త్ 4, హెచ్ సెక్షన్ -3, పెన్షన్- 1, మొత్తం 43 అర్జీలను కమిషనర్ అందుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాడలేని చెరకు పంట

- ఒకప్పుడు 1,500 ఎకరాల్లో సాగు
- సూదలగుంట ఫ్యాక్టరీ మూత
- నేడు ఎక్కడికి తోలాలో తెలియక రైతుల అయోమయం
- ఇప్పటికీ సాగుపై కొందరికి ఆసక్తి



చెరకు పంట (ఫైల్)

పొదలకూరు: మండలంలో చెరకు సాగు ఒకానొక సమయంలో వెలిగిపోయింది. ఫ్యాక్టరీ యజమాన్యాల చేతకానితనం, బకాయిలు పెట్టి తప్పించుకోవడంతో ఈ ప్రాంతంలో నేడు పంట లేకుండాపోయింది. ఇప్పటికీ కొందరు సాగుపై ఆసక్తి చూపుతున్నా వీలుకాని పరిస్థితులతో ముందుకు రావడం లేదు. జిల్లాలో అందుబాటులో ఎక్కడా ఫ్యాక్టరీలు లేకపోవడం, బయట ప్రాంతాలకు తోలితే గిట్టుబాటు కాని ధరలతో పెన్నార్ డెల్టా రైతులు చెరకు సాగును మానుకోవాల్సి వచ్చింది.

ఇదంతా గతం

ఒకప్పుడు మండలంలో 1,500 ఎకరాల్లో చెరకు ఉండేది. విరువూరు, సూరాయపాళెం, మహ్మదాపురం, తాటిపర్తి, నేదురుమల్లి, ముదిగేడు, ఇనుకుర్తి తదితర గ్రామాల్లో సాగు చేసేవారు. పీజీపట్నం పంచాయతీ పరిధిలో ఉన్న సూదలగుంట షుగర్స్‌కు అప్పట్లో పంటను తోలేవారు. గతంలో క్రషింగ్ సీజన్ ప్రారంభమైతే ఆయా గ్రామాల్లో హడావుడి నెలకొనేది. చెరకు కొట్టే కూలీలు గ్రామాలకు చేరుకునే వారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవు. నేడు ఒక్క ఎకరాలో కూడా పంట లేదు.

భారంగా మారి..

చెరకు సాగు భారంగా మారడంతో రైతులు క్రమంగా విస్తీర్ణం తగ్గించుకుంటూ వచ్చారు. చివరకు ఒక్క ఎకరాలో కూడా లేకుండా పోయింది. సూదలగుంట షుగర్స్ యాజమాన్యం రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో సమస్యలు తలెత్తి దానిపై అధికారులు ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించాల్సి వచ్చింది. ఫలితంగా బకాయిల కోసం 2020లో రైతులు ఫ్యాక్టరీ వద్ద ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. దీంతో క్రమంగా సాగుపై మక్కువ తగ్గించుకున్న రైతులు చివరికి పూర్తిగా మానుకున్నారు. సీజనల్లో ఫ్యాక్టరీలో 2 లక్షల టన్నులు క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్నా క్రమంగా చెరకు తోలకాలు తగ్గిపోయి లాకౌట్ నాటికి 50 వేల టన్నులు కూడా ఫ్యాక్టరీకు వచ్చేది కాదు. దీంతో అది మూతపడి ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడ్డారు. బకాయిల కోసం రైతులు పోరాటం చేయాల్సి వచ్చింది.



మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ (ఫైల్)

తర్వాత కేన్ కమిషన్‌తోపాటు కలెక్టర్ చొరవ తీసుకుని బకాయిలు నాలుగైదేళ్ల తర్వాత విడతవారీగా ఇప్పించగలిగారు.

ఆసక్తి ఉంది



ఇప్పటికీ కొందరు రైతులకు చెరకు సాగుపై ఆసక్తి ఉంది. అయితే పండించిన పంటను ఫ్యాక్టరీలకు తోలుకోవడంలో ఇబ్బందులున్నాయి. మద్దతు ధరలు లభించకపోవడం, దూరంగా ఉన్న ఫ్యాక్టరీలకు తోలినా బకాయిలు సకాలంలో చెల్లిస్తారన్న నమ్మకం లేకపోవడంతో ఆసక్తి ఉన్నా వరి సాగుపై మళ్లారు. మండలంలోని పెన్నార్ డెల్టా గ్రామాల్లో రైతులకు రెండు దశాబ్దాలుగా పైగా చెరకు పంట సాగు చేసిన అనుభవం ఉంది.

– కండ్లకూటి రమణారెడ్డి, పూర్వ చెరకు రైతు, మహ్మదాపురం

నిత్యాన్నదానానికి రూ.10 లక్షల వితరణ



కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి చెన్నై మొగలివాకానికి చెందిన కె.మల్లికార్జున- ప్రభావతి దంపతులు రూ.10 లక్షల విరాళమిచ్చారు. ఈ మేరకు వారు చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వెంకట శ్రీనివాసులురెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శేష వస్త్రం, కుంకుమ, తీర్థ ప్రసాదాలు దాతలకు అందజేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

కొడవలూరు: ఆర్టీసీ బస్సును వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని వారితోపాటు ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. సోమవారం తాడేపల్లి నుంచి తిరుపతి వెళ్తున్న కారు నార్తురాజుపాళెం టపాతోపు వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినడంతోపాటు ఆర్టీసీ బస్సు వెనుక భాగం దెబ్బతింది. కారులోని ప్రయాణికులు, బస్సులోని ప్రయాణికులు ఎలాంటి గాయాల్లేకుండా సురక్షితంగా బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): నగర పంచాయతీ పరిధిలోని లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ అవకాశం కల్పించిందని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేఅవుట్‌లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్న వారు 10 లేదా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలతో పాటు పీనలైజేషన్ చార్జీలను చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ అవకాశం మూడు నెలలు మాత్రమే ఉంటున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బాలకృష్ణ, కమిషనర్

కుష్టు రహిత సమాజమే ధ్యేయం

నెల్లూరు(అర్బన్): కుష్టు రహిత సమాజమే ధ్యేయంగా వైద్యసిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా కుష్టు నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబుతో కలిసి ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొత్తగా నమోదైన కేసులు, వారికి అందిస్తున్న వైద్యం గురించి ఆరాతీశారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా అంగవైకల్యం లేకుండా చేయవచ్చని తెలిపారు. వచ్చేనెల 11న అంగవైకల్యం గల బాధితులకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పీఓడీ క్యాంపు నిర్వహించాలని కోరారు. అవసరమైన వారికి సీఎంఆర్ చెప్పులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీఎఫ్ఐటీ ఏఓ సతీష్, మల్లమ్మ, డీపీఎంఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ

దోమల నివారణతో వ్యాధులకు చెక్

నెల్లూరు(అర్బన్): దోమల నివారణతో డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా లాంటి పలు రకాల వ్యాధులను దూరం చేయొచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి రోగులకు చేసిన రక్త పరీక్షల వివరాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని కార్పొరేషన్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలను నివారించేందుకు ఇంటి ఆవరణలో, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల లార్వాలను నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వేదమూర్తి, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

మాజీ మంత్రి అనిల్‌కు నోటీస్

కోవూరు: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుపై నమోదైన కేసులో మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని ఎస్సై రంగనాథ్‌గౌడ్ నోటీస్ జారీ చేశారు. దీనిని నెల్లూరులోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి అందజేశారు.

బాలికలకు అవగాహన

పొదలకూరు: స్థానిక గాయత్రి స్కూల్లో సోమవారం బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పోలీస్ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చంద్రబాబు, మహిళా కానిస్టేబుల్ సౌమ్య, కానిస్టేబుల్ వెంకటేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన నిమ్మ చెట్ల పరిశీలన

సైదాపురం: మండలంలోని కమ్మవారిపల్లెలో గిరిజనులు, దళితులు సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లను తొలగించిన ప్రాంతాన్ని సీపీఎం బృందం ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన వ్యక్తి పల్లెటి వెంకటేశ్వర్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి గిరిజనులు, దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. నాయకులు శ్రీనివాసులు, రైతులు వెంకటయ్య, బాలు, రమణమ్మ, కృష్ణమ్మ, శివయ్య, శ్రీనివాసులు, మస్తానయ్య పాల్గొన్నారు.

డాక్టర్ నరేంద్ర మృతి



నరేంద్ర(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ (హెచ్‌ఓడీ)గా పనిచేస్తూ రెండు వారాల క్రితం తిరుపతి రుయా ఆస్పత్రికి బదిలీ అయిన ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర(53) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన తిరుపతిలోని రుయా ఆస్పత్రి భవనం ముందు నడుచుకుంటూ వెళ్తుండగా హార్ట్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే స్విమ్స్ ఆస్పత్రికి తరలించేలోపు మృతిచెందారు. ఆయన ప్రస్తుతం నెల్లూరులోనే నివాసం ఉంటున్నాడు. చాలాకాలం నుంచి నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీగా, కోవిడ్ నోడల్ ఆఫీసర్‌గా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా, పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పాలన మరచిన కూటమి ప్రభుత్వం

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలనను మరచిపోయి కక్ష సాధింపు చర్యలకు మాత్రమే పాల్పడుతోందని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ దుయ్యబట్టారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అసత్యాలను చెబుతూ అవినీతికి పాల్పడుతోందన్నారు. దుగరాజపట్నం పోర్టును కష్టపడి తీసుకొస్తే చంద్రబాబు లేఖ రాసి ఆపించేశారన్నారు. రాజధాని పేరుతో 70 వేల ఎకరాలు తీసుకొని నీళ్లలో పెట్టారన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఆధారాలు ఉంటే బయట పెట్టాలన్నారు. రాష్ట్రంలోని పేదలకు సరైన విద్య, ఆరోగ్యం అందడం లేదన్నారు. సైదాపురం మైన్స్‌లో విపరీతంగా అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కెట్‌కు నాణ్యత లేని నిమ్మకాయలు

- పెరగని ధరలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: ఎన్నడూ లేని విధంగా జూలై నెలలో నిమ్మకాయలు పతనావస్థలోనే ఉన్నాయి. స్వల్పంగా ధరలు పెరిగే అవకాశం ఉన్నా నాణ్యత లేనివి మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో ఉన్న ధరలు కూడా పతనం అవుతున్నట్టు తెలుస్తోంది. శ్రావణ మాసం వచ్చాక కిలో కాయలు రూ.15 నుంచి రూ.26 పలుకుతున్నాయి. బస్తా(లూజు) ధర రూ.1,200 నుంచి రూ.2 వేల వరకు ఉంది. ఇదే సీజన్‌లో గతేడాది లూజు (బస్తా) టాప్ రూ.5,400 వరకు ధరలు పలికింది. ఈ ఏడాది రైతుల తోటల్లో దిగుబడి పెరగడంతోపాటు నాణ్యత లేని కాయలు వస్తుండటంతో ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

నాణ్యత లోపించి..

తోటల నుంచి నాణ్యత లోపించిన (డాగులు) కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. సాధారణంగా రైతులు ఐదునెలలకు కాయలను కోయాల్సి ఉంటుంది. అయితే ఆరునెలల తర్వాత కోసి మార్కెట్‌కు తరలించడంతో నాణ్యత లోపిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. దీనికితోడు వాతావరణంలో మార్పులు, చివరి కాపు తదితర సమస్యలతో నాణ్యత లేని కాయలు తోటల నుంచి రావడంతో ధరలు పతనం అవుతున్నట్టు వెల్లడిస్తున్నారు. ఆగస్టులోనూ ధరలు పెరుగుతాయన్న నమ్మకం రైతుల్లో లేదు. శ్రావణమాసం, వినాయక చవితి తదితర పండగల సందర్భంగా స్వల్పంగా నిమ్మ ధరలు పెరిగినా రైతులు ఆశించిన మేరకు మాత్రం ఉండవని వ్యాపారులు అంటున్నారు. దసరా నుంచి పుంజుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

కాలుష్యాన్ని నివారించాలంటూ నిరసన



మాట్లాడుతున్న చింతా మోహన్

ముత్తుకూరు(పొదలకూరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో పరిశ్రమల ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. ముత్తుకూరులో సోమవారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టును ప్రధాని మోదీ స్నేహితుడు కైవసం చేసుకున్నట్టు విమర్శించారు. ఈ ప్రాంతంలో ప్రతి ఇంటికీ రూ.18 వేలు ప్యాకేజీ అందజేస్తామని ఇవ్వలేదన్నారు. ఈ ప్రాంతంలో వెలువడుతున్న కాలుష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాల్సిందిగా పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగావకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్‌లో సైతం రిజర్వేషన్లు అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అవకాశాలు కల్పించాల్సిందిగా వెల్లడించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సర్వేపల్లి ఇన్‌చార్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరికి అగ్గితెగుల బెడద

తోటపల్లిగూడూరు: మండలంలో సాగులో ఉన్న రెండో పంట (ఖరీఫ్)కు అగ్గితెగులు అధికం కావడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోడూరు, వరిగొండ, మాచర్లవారిపాళెం కాలువల ఆయుకట్టు పరిధిలో 12 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పైరు లేత పొట్ట, వెన్ను దశలో ఉంది. కాగా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో అగ్గితెగులు సోకుతోంది. ఏపుగా పెరుగుతున్న పైరు ఎర్రగా మారిపోతోంది. వ్యవసాయాధికారులు సూచించిన మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అధికంగా పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న తమకు అగ్గితెగులు రూపంలోనే తొలిదెబ్బ మొదలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 1,200 ఎకరాల్లో ఈ తెగులు ఉధృతంగా ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.



మందును పిచికారీ చేస్తున్న రైతు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కొడవలూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరించాలని హెల్త్ అసిస్టెంట్ ఒ.సుధాకర్ సూచించారు. మండలంలోని కమ్మపాళెంలో ఇంటింటి లార్వా సర్వేను సోమవారం నిర్వహించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలోని మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో దోమల ఆవాసాలను నివారించుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్‌ఎం టి.రాధమ్మ, ఆశా కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.



కొడవలూరు: కమ్మపాళెంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పడుగుపాడులో..

కోవూరు: స్థానిక పడుగుపాడు ఎన్టీఆర్ కాలనీలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు సంబంధించి సోమవారం విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం, ర్యాలీ, ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమల ఉత్పత్తి లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోవూరు: పడుగుపాడు ఎన్టీఆర్ కాలనీలో..

స్మార్ట్ మీటర్లతో ప్రజలకు నష్టాలే



బుచ్చిరెడ్డిపాళెంలో పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): స్మార్ట్ మీటర్లతో ప్రజలకు నష్టాలే మిగులుతుందని, దీనిపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి పోతం శ్రీనివాసులు తెలిపారు. స్మార్ట్ మీటర్‌లతో కలిగే నష్టాలపై ముద్రించిన కరపత్రాలను సీపీఎం పట్టణ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను గతంలో చంద్రబాబు, లోకేశ్‌లు తీవ్రంగా వ్యతిరేకించారని, ప్రస్తుత వారే అదానీకి లాభం చేకూర్చేందుకు యతిస్తున్నారని విమర్శించారు. ప్రతిఇంటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేయడం ద్వారా స్మార్ట్ మీటర్ల నష్టాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, ఆవాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు జానీబాషా, నాయకులు ఖాదర్‌బాషా, సుబ్రహ్మణ్యం, సుభకుమార్ పాల్గొన్నారు.

కోవూరులో..

కోవూరు: స్థానిక సీతా పోలయ్య భవనంలో సీపీఎం మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలపై కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుజ్జయ్య, సుబ్బారావు, బాబు, హరి పెద్దబ్బాయ్య, మల్లికార్జున్‌రెడ్డి, చాంద్‌బాషా, ఫాతిమా, సురేంద్ర, యస్దాని తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో..